# మిగ్‌జాం అలర్ట్

- మరో 24 గంటలు తుఫాన్ ప్రభావం
- కొన్ని చోట్ల భారీ వర్షాలకు అవకాశం
- వాతావరణ శాఖ హెచ్చరిక
- ఉమ్మడి జిల్లాలో చలిగాలుల ప్రభావం
- అప్రమత్తమైన రైతులు
- చలి, ముసురుతో ప్రజల పరేషాన్



కోడేరు : అకాల వర్షానికి నేలకొరిగిన వరి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ) : చలికాలంలో మిగ్‌జాం తుఫాన్ ప్రభావం చూపిస్తోంది. ఏపీ, తమిళనాడులో ఈ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తూ వరదలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో జిల్లాలోని పలు గ్రామాల్లో రాత్రి నుంచి అక్కడక్కడా ముసురు కురుస్తున్నది. ఈసారి వానకాలంలో ఆశించిన వర్షాలు కురవలేదు. పదిహేను రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాపారాలు త్వరగానే మూతపడుతున్నాయి. ప్రజలు రోడ్లపైకి ఎక్కువగా రావడం లేదు. ఈక్రమంలో మిచౌంగ్ తుఫాన్ రెండ్రోజులుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. పలు గ్రామాల్లో ముసురు వర్షానికి విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర చలితో ఇండ్లకే పరిమితమవుతున్నారు. ఈ తుఫాన్ వల్ల ఉమ్మడి పాలమూరులోని నాగర్‌కర్నూల్‌కు ఎల్లో అలర్ట్ ప్రకటించగా వనపర్తితోపాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది. ఈ వర్షాలకు వరి రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ధాన్యం చేతికొచ్చి ఎండబెట్టుకొని మార్కెట్‌కు తీసుకెళ్లే సమయంలో తుఫాన్ ప్రభావం చూపనున్నది. దీంతో ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచాలంటున్నారు. తడిసిన ధాన్యానికి తేమ ఉంటే గిట్టుబాటు ధరపై ప్రభావం పడుతుంది. కాగా ఓవైపు ముసురు, మరోవైపు చలితో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నట్లుగా వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు స్వెట్టర్లు ధరించాలని, వేడి ఆహారం భుజించాలని, బయట తిరగరాదని సలహాలిస్తున్నారు. ఈ తుఫాన్ మరో 24గంటలు ప్రభావం చూపించనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.



ఉమ్మాపూర్‌లో తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పైరు

### ఆందోళనలో అన్నదాత..

వంగూరు, డిసెంబర్ 5 : చేతికొచ్చిన వరి పంట మిగ్‌జాం రూపంలో వచ్చిన తుఫాన్ ధాటికి నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి అధికమొత్తంలో సాగు చేశారు. పంట కోత దశలో ఉండగా రాకాసి తుఫాన్ రైతన్నను నిండా ముంచింది. కేవలం 30శాతం పంటను కోయగా మిగిలిందంతా నేలపైనే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏపుగా పెరిగిన పంట నేలమట్టమైంది. వర్షం ఇలాగే కొనసాగితే ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. వంగూరుతో పాటు గాజర, తిప్పారెడ్డిపల్లి, ఉమ్మాపూర్, డిండిచింతపల్లి, మిట్టసదగోడు, ఉల్పర, పోతారెడ్డిపల్లి, రంగాపూర్, కొండారెడ్డిపల్లి, నిజాంబాద్, తిరుమలగిరితోపాటు పలు గ్రామాల్లో కోత మిషన్లు తీసుకొచ్చే సమయానికి తుఫాన్ వారి ఆశలపై నీళ్లు చల్లింది.

### నేలకొరిగిన వరిపంట

కోడేరు, డిసెంబర్ 5 : మిగ్‌జాం తుఫాను ప్రభావం వల్ల కోడేరు మండలంలో మంగళవారం ఉదయం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు వరిపంట దెబ్బతిన్నది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి చేతికి వచ్చే సమయంలో నేల కొరగడంతో ఆందోళన చెందుతున్నారు. వర్షంతో పంట మునుగుతున్నది. ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం పడుతున్నందునా కోతలు కోసినా వరి ధాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ముసురు వర్షానికి గింజలు మొలకెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తుఫాన్ కలవరం..

ఊట్కూర్, డిసెంబర్ 5 : తుఫాన్ ప్రభావం అన్నదాతలను కలవర పెడుతున్నది. బంగాళాఖాతంలో ఏర్పడిన మిగ్‌జాం ప్రభావంతో రెండ్రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో జల్లులు కురుస్తున్నాయి. మక్తల్ నియోజకవర్గంలోని నదీతీర ప్రాంతాలతోపాటు చెరువులు, కుంటలు, బోరుబావుల కింద సాగైన వరి పంటలను రైతులు కోస్తున్నారు. మంగళవారం జల్లులు కురవగా కోత పెట్టిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షానికి గింజలు నేల రాలే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మరోపక్క పత్తి పంట చివరి దశకు చేరగా తుఫాన్ ప్రభావంతో నల్లబారుతుందని, దీంతో ధర మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన వరి, పత్తి పంటలను ఇంటికి తరలించేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు.



ఊట్కూర్: రైస్‌మిల్లు వద్ద ధాన్యం తడిసిపోకుండా పాలిథిన్ కవర్లు కప్పిన దృశ్యం

## పరమ శివుడిపై శుద్ధ భక్తి ఉండాలి

- ఆధ్యాత్మిక ప్రవచకులు హయగ్రీవాచార్యులు



శ్రీశైలంలో ప్రవచనం చెబుతున్న హయగ్రీవాచార్యులు



నృత్యం చేస్తున్న భరణి నాట్య బృందం

శ్రీశైలం, డిసెంబర్ 5 : శ్రీశైలంలో జ్యోతిర్లింగమై వెలిసిన పరమ శివుడిపై శుద్ధమైన భక్తి ఉంటే స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు సులభంగా పొందవచ్చని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు దివి హయగ్రీవాచార్యులు అన్నారు. కార్తీకమాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధానాలయ మాడవీధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివానందలహరి గ్రంథంలో ఆదిశంకరాచార్యుల వారు శివతత్వం గురించి ప్రస్తావించిన విశేషాలను భక్తులకు వివరించారు. శివ పరమాత్ముని పూజించేందుకు నిస్వార్థమైన శుద్ధ భక్తిని కలిగి ఉండటం అంటే ఏమిటనే విషయాన్ని క్షుణ్ణంగా వివరించారు. అదే విధంగా ప్రతిఒక్కరూ శివానందలహరి గ్రంథాన్ని పఠించడం వల్ల శ్రీశైల క్షేత్ర మహత్యం గురించి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ భరణి నాట్య బృందం స్వామి, అమ్మవార్లకు సంప్రదాయ నృత్య నివేదన చేశారు. ప్రదర్శన చేసిన వారిలో రాగిణి, సంయుక్త, నిత్యశ్రీ, శ్వేత, మానస, వైష్ణవి, శ్లోక ఉన్నారు.

- విజేతలకు నగదు ప్రదానం

## ఆకట్టుకున్న సందెరాళ్ల పోటీలు



విజేతకు నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గట్టు, డిసెంబర్ 5 : అంబాభవాని జాతర సందర్భంగా గట్టులో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో సందెరాళ్లు ఎత్తే పోటీలను మంగళవారం నిర్వహించారు. విజేతలుగా బోయ ప్రతాప్, కుక్కునూర్ అంపయ్య, మూలమళ్ల రాముడు, గుడబలూరు, మిట్టదొడ్డి ఉరుకుంద నిలిచారు. వీరికి దాతలు (బీఆర్ఎస్ నాయకులు మోహన్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, సంతోష్, మహేశ్వరి రామునాయుడు, కృష్ణ, హనుమంతురెడ్డి) వరుసగా రూ.10,016, రూ.8,016, రూ.6,016, రూ.4,016, రూ. 3,016, రూ.1,016 నగదు అందజేశారు. కార్యక్రమంలో బజారి, వీరారెడ్డి, భాస్కర్, రంగస్వామి, నరేశ్, లక్ష్మణ్, తిమ్మప్ప, అంజి, మధు ఉన్నారు.

## జూరాలకు స్వల్ప వరద

- ఇన్‌ఫ్లో 3,482 క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 1,468 క్యూసెక్కులుగా నమోదు


ధరూరు, డిసెంబర్ 5 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి స్వల్ప వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 3,482 క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో 1,468 క్యూసెక్కులుగా నమోదైంది. ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 338 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 673 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 544క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 8.126 టీఎంసీలు కాగా 4.419 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

### ఆర్డీఎస్‌కు స్థిరంగా వరద..

అయిజ, డిసెంబర్ 5 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం ఆర్డీఎస్ ఆనకట్టకు 2,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 1,900 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 457 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.4 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

### టీబీ డ్యాంకు..

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 680 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1,958 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 13.126 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1,633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1592.37 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.



ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పారుతున్న నీరు





# పెండ్లి సందడి

- నేటి నుంచి వివాహ ముహూర్తాలు
- ఆరు నెలల పాటు ఇక వెడ్డింగ్ సీజనే..
- పెళ్లి బాజా నుంచి ఫొటో షూట్ వరకు సందడే సందడి
- డెకరేషన్, క్యాటరింగ్, వాయిద్య బృందం, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫుల్ డిమాండ్







మహబూబ్‌నగర్ డెస్క్, డిసెంబర్ 5 : పెళ్లంటే నూరేళ్ల పంట. ప్రతి వ్యక్తి జీవితంలో మరుపురాని మధుర ఘట్టం. లైఫ్ పార్ట్‌నర్‌తో కొత్త జీవితానికి నాంది పలికే శుభదినం. మరి ఆ ముచ్చట సాదాసీదాగా జరిగిపోతే ఎలా.. వివాహ వేడుకల్లో ఆనందకరంగా సాగే ప్రతి తంతూ జీవితాంతం మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాల్సిందే. కాస్త వెలుగు.. జిలుగులు అద్దాల్సిందే. పెళ్లంటే తాలిబొట్లు, తలంబ్రాలు, పూలదండలు, ఆభరణాలు, వేదమంత్రాలు, సన్నాయిమేళాలు, షడ్రుచుల భోజనాలే కాదు. ఇప్పుడు వెడ్డింగ్‌కు సినిమా షూటింగంత వైభవం వచ్చిందంటే ఆశ్చర్యమేమీ లేదు. ప్రతి తంతు ఇక కళాత్మకంగా మారింది. ఫొటో, వీడియో షూట్లకు అమాంతం ప్రాధాన్యం పెరిగింది. ఈనెల 6వ నుంచి పెండ్లి ముహూర్తాలు ప్రారంభంకానున్నాయి. మే వరకు పెళ్లిళ్ల సీజన్ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు, పురోహితులు, కేటరింగ్ నిర్వాహకులు, సన్నాయి మేళ బృందాలకు డిమాండ్ పెరగనున్నది.

### ఎన్నో హంగులు..

- వధూవరుల మంగళస్నానాలకు చేసే డెకరేషనే ప్రస్తుతం చిన్నసైజ్ పెండ్లి వేడుకలను తలపిస్తున్నాయి. పసుపు నీళ్లు వేసేందుకు అందాల జల్లెడ, సప్తవర్ణ శోభితమైన బిందెలు, మహారాజుల వైభవాన్ని గుర్తుకుతెచ్చే కంచుపాత్రలు, వాటిలో పన్నీరు కలిపిన నీళ్లు.. అందులో తేలియాడే రంగు రంగుల పూలు వన్నెలద్దుతున్నాయి.
- బాసింగాలు, పెళ్లి కుమారుడికి అలంకరించే మహరాజా తలపాగాలు, సంప్రదాయ టోపీలు, కాళ్లకు తొడిగే పాంకోళ్లు, రోళ్లు, రోకళ్లకు రకరకాల రంగులతో ముస్తాబు, పెళ్లి కుమార్తెకు కొత్త అందాన్ని తెచ్చి అలంకరించే పూలజడలు, ఖరీదైన జాకెట్లు చేతులకు కళాత్మక మెహందీలు, అందమైన మేకప్, పెళ్లికుమార్తెను తీసుకువెళ్లే బుట్ట, గొడుగు.. ఇలా వివాహ వేడుకలో ఎన్నో నూతన ఆకర్షణలు బంధుమిత్రులను కట్టిపడేస్తున్నాయి. శాస్త్ర సమ్మతం కాదా.. అవునా.. అనే విషయాన్ని పక్కన పెడితే వివాహ సమయంలో వధూవరుల మధ్య ఏర్పాటు చేసే తెరను సైతం అందంగా తీర్చిదిద్దుతున్నారు ఈవెంట్ మేనేజర్స్. వాటిపై సీతారాములు లేదా, అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి వంటి చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. వాటిపై దేవతలను లేసు దారాల అల్లికలతో తీర్చిదిద్దుతుండడం విశేషం. వాటి వల్ల వివాహ సమయానికి దైవానుగ్రహం ప్రసరిస్తుందనే భావన కలిగిస్తున్నారు.
- వివాహ సమయంలో వధూవరుల చేతుల్లో పెట్టే కొబ్బరిబొండాలకు ముత్యాలు, పగడాలు, కెంపులతో కొత్త ఆకర్షణలు తీసుకొస్తున్నారు. వేడుకల్లో ఇప్పుడు సంప్రదాయ కర్పూర దండలు కొత్త రూపాల్లో కనువిందు చేస్తున్నాయి.
- తలంబ్రాలకు వాడే కొబ్బరి కురిడీలను సైతం నిర్వాహకులు అద్భుతంగా ముస్తాబు చేస్తున్నారు. ఇక పెళ్లి మండపం ముస్తాబైతే చెప్పనక్కర్లేదు. ఈవెంట్ మేనేజర్స్ మండపం కోసం పూలను హైదరాబాద్, బెంగళూరు నగరాల నుంచి పెద్ద ఎత్తున తెప్పిస్తున్నారు. కళ్లు మిరిమిట్లు గొలిపే లైటింగ్ సమకూరుస్తున్నారు.





### ఫొటోషూట్లకు డిమాండ్ ఉన్నది..



పెళ్లికుమార్తెల ముస్తాబు నుంచి కార్ల డెకరేషన్ వరకు వేడుకల్లో మార్పు వచ్చింది. ఫొటో షూట్లకు గతంలో కంటే డిమాండ్ పెరిగింది. ఇప్పుడు వధూవరుల అలంకరణ పెద్ద ఫ్యాషన్. మంగళ స్నానం, పెళ్లి తంతులకు సినిమా స్టైల్లో ఫొటోషూట్స్ జరుగుతున్నాయి. పెండ్లి కుదిరి శుభలేఖ ప్రింట్ అయినా నాటి నుంచి వివాహ వేడుక ముగిసేవరకు ఫొటో, వీడియోగ్రాఫర్లకు పని దొరుకుతున్నది.

**– సతీశ్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్,**